


# పేపర్ టైగర్

"ఈ వర్షం ఇప్పుడప్పుడే వదిలే లాగ లేదబ్బాయ్!" అన్నారు నరసింహంగారు, కిటికీలోంచి బయటికిచూస్తూ. ఆయనకి చాలా చిరాగ్గా వుంది.

'నువ్వు ఇప్పుడప్పుడే నన్ను వదిలే లాగ లేదబ్బాయ్!' అన్నట్టు విన్పించింది 'అబ్బాయ్'కి. అబ్బాయ్ పేరు వరప్రసాదరావు. అతనా గదిలో ఒక సోఫాలో కూర్చున్నాడు. కూర్చున్నాడనడం కంటే సోఫాని ఆనుకొని 'గోడకుర్చీ' వేసేడనడం సబబు. తను కూర్చుంటే సోఫాకి ఏం నొప్పెడుతుందో, ఏకుళ్ళు అంటుకుంటే నరసింహంగారు ఏం చేసేస్తారో అని భయపడుతున్న వాడిలా వున్నాడతను.

ఆ సాయంకాలం అతను నరసింహంగారింటికి వస్తూవుంటే, అల్లంత దూరంలో వుండగానే టపటపా చినుకులు పడ్డం ఆరంభించాయి. వాళ్ళింటికి వచ్చేసరికి అతని చొక్కా వొంటికి అతుక్కుపో

యింది. ఎత్తుగాదువ్విన జుత్తు అంగారి పోయి బుర్రకి అంటుకు పోయింది. నీళ్ళతో కలిసి, నూనె తలమీంచి కారి మొహమంతా జిడులా తయార యింది. నరసింహంగారి ఇంటికి వచ్చాక మెట్లెక్కి వరండాలోనుంచుని రుమాలుతో — తలతుడుచుకోవాలో, మొహం తుడుచుకోవాలో తేల్చుకోలేక మోచేతులు తుడుచుకొంటూ కాలింగ్‌బెల్ నొక్కేడతను.

ఆసమయంలో నరసింహం గారొక్కరే ఇంట్లో వున్నాడు. ఆయన కొడుకూ, కోడలూ, మనవలూ అంతా ఏదో న్నాడు. కనిపించగానే వినయంగా నమస్కారం చెయ్యమని మరీ మరీ చెప్పి పంపించిన తాతగారి మాటే మర్చిపోయేడు. నరసింహంగారి మొహం చూస్తూనే ఎందుకోగాని గాబరా పడిపోయాడా కుర్రవాడు.

నరసింహంగారికి, ముఖంలో రంగులు మార్చడంలో ఒక ప్రాక్టీసు వుంది. ఆయన తన చిన్న మనవడితో ఆడుకుంటున్నప్పుడు ఎంతగా బోసి నవ్వులు చిందిస్తాడో, అదే సమయంలో పని కుర్రాడితో మాట్లాడవలసొస్తే అంతకటువుగానూ వుండ గలడు. పూర్వం కూడా

# యన్. యస్. ప్రకాశరావు

పార్టీకి వెళ్ళేరు.

కాలింగ్‌బెల్ విని ఆయనే తలుపు తీసేడు. తలుపు తియ్యగానే— చామనచాయవాడు, జిడ్డుమోమువాడు, రెండు పదుల వయసువాడు, బక్కపలుచని వాడు-వరప్రసాదుడు కనిపించాడు. అతని రూపు రేఖా విలాసాలు చూసేక, లోపలకు రమ్మనాలో, బైటేవుంచి 'ఎవరి కోసంవని' అడగాలో తేల్చుకోలేక డోర్ నాబ్ పట్టుకొని ఒక్కక్షణం అలా నిల్చుండిపోయేడాయన.

నరసింహంగారిని చూడగానే వరప్రసాదరావు నోరు పెగల్లేదు. పెద్ద పులిని చూచినట్టు ఒక్కసారి జడుసుకు తన క్లయింట్లతోనూ జడ్జీలతోనూ ఎంత 'మృదుమధురంగా' మాట్లాడే వాడో, తమ వూళ్ళో రైతులోటీ, కూలీల్తోటీ, అంత కర్కశంగా మాట్లాడే వాడాయన. ఎవరైనా కొత్తవాళ్ళను చూసే చూడ్డంతోటే, విధిగా ఆయన ముఖంలో రంగులు మారతాయి. అవతల వాణ్ణి చూస్తూనే ఆయన ఒక అంచనా వేసుకొంటాడు. దాంతో ముఖం ప్రసన్నంగా పెట్టడవా, గంభీరంగా పెట్టడవా, 'ప్రసన్నగంభీరంగా' పెట్టడవా అన్నది తేల్చుకొంటాడు.

కాని వరప్రసాదరావుని చూసి ఎలా ముఖం పెట్టాలో ఆయనకి వెంటనే తెలి

యక తటపటాయించాడు.!

ఇంతలో ఆ కుర్రవాడు జేబులోంచి ఓ వుత్తరం తీసి ఇచ్చేడు. అది చూస్తూనే, అయోమయపు రంగులోంచి కొంచెం ప్రసన్నపు రంగులోకి మొహాన్ని మార్చు కొన్నాడు నరసింహంగారు.

"రా లోపలికి' అన్నాడాయన.

వను వచ్చినపని సగం అయిపోయి నట్టేనవిపించి, చిన్న పొంగుపొంగి పోయేడు వరప్రసాదరావు.

కాని,

వెంటనేనరసింహంగారు 'జోళ్ళు...' అంటూ అర్థాంతరంగా ఆగిపోవడంతో ఒక్కసారి కుంగిపోయాడా అబ్బాయి.

ఆకుర్రవాడి జోళ్ళు చిరుబురదతో వున్నాయి. 'ఆయన చెప్పబట్టి సరిపో యిందికాని, అమ్మబాబోయ్! ఆ జోళ్ళతో లోపలికి వచ్చేస్తే ఇంకేంవన్నా వుందా?' అనుకుని మనసులోనే 'ఫెడీ ఫెడీ' మని లెంపలు వాయించేసుకొన్నాడు వర ప్రసాదరావు.

జోళ్ళు, బైటేవదిలి, లోపలికి వచ్చి సోఫాముందు 'గోడకుర్చీ' వేసేడా కుర్ర వాడు. 'సరిగా కూర్చో ఫరవాలేదు, అందామని నోటిదాకా వచ్చింది కాని మరేంచేతో నరసింహంగారు అనలేదు.

ఆ కుర్రవాడి తాతగారూ, నరసింహం గారూ, చిన్నప్పుడు క్లాసుమెట్సు. ఆ రోజుల్లో వాళ్ళిద్దరూ— 'చదువు లేక పోతే మన బతుక్కి మరోదారీ తెన్నూ లేదు. చదువుకోకపోతేమట్టికొట్టుకుపోతాం సుమా'—అనుకొని కష్టపడి చదువుకొన్న వాళ్ళే కాని, పెద్దలు చెప్పినట్టు రోజులు అందరికీ ఒక్కలా వుండవు కదా!

నరసింహంగారికి రోజులు మారేయి. 'దశ' మళ్ళింది. ఆరోజుల్లో కుర్ర నరసింహాన్ని చూసి—తన బాగుకోసం, అవసరంవస్తే- 'అమ్మలేదు, నాన్న లేడు, అన్న, చెల్లి ఎవరూలేరు లేరంటే లేరు' అని ఈ కుర్రవాడు అనుకోగలడని ఎలా పసిగట్టారోగాని, పసిగట్టేరాక పెద్ద ప్లీడరుగారు. అంత చిన్నవయసు లోనే ఆకుర్రవాడికి 'జ్ఞానోదయం' కలిగి నందుకు తెగముచ్చిసి పోయేదాయన.

ఆ తరువాత నరసింహంగారు. ఆ ప్లీడరుగారింటికి ఇల్లరికపు టల్లుడుగా వెళ్ళేడు; మద్రాసుకి 'లా' స్టూడెంటుగా వెళ్ళేడు. కోర్టుకి మావగారి జూనియర్ గా వెళ్ళేడు. ఆతరువాత ఎన్నెన్నో చోట్లకి ఎంతోగొప్పగా, గర్వంగా వెళ్ళేడు.

నరసింహంగారికి భగవంతుడంటే చెప్పలేనంత భక్తి. కాని ఆయనకి మావగారంటే అంతకన్న ఒక్క పిసరు ఎక్కువ భక్తి. ఆయన పావుగంటసేపు మాట్లాడేడంటే అందులో అరగంటసేపు మావగారిని గురించి రిఫరెన్సేవుంటుంది.

నరసింహంగారికిప్పుడు ముగ్గురంటే ముగ్గురేమగపిల్లలు. ఆయన పెద్దకొడుకు బొంబాయి దగ్గిర ఏదో ఆయిల్ రిఫైన రీలో జనరల్ మేనేజర్ హోదాకి ఒకే ఒక మెట్టుకింద వున్నాడు. అందుగు రించి నరసింహంగారెప్పుడూ చిరాకుపడు

తూనే వుంటారు. రెండోకొడుకు ఈ వూళ్ళోనే యూనివర్సిటీలో అసిస్టెంటు ప్రొఫెసరుగా వున్నాడు. అతను ఇప్పట్లో ప్రొఫెసరవాలంటే, ఇప్పుడు ప్రొఫెసరుగావున్నాయన హఠాత్తుగా హరీమనడం ఒక్కటే మార్గం.

అదితల్చుకొన్నప్పుడల్లా నరసింహం గారికి ఆ ప్రొఫెసరు పీకపిసికేద్దాంవా అన్నంత కోపం వస్తుంటుంది. మరి మూడోవాడు అమెరికాలో రిసెర్చి చేసు న్నాడు. అమెరికాలో 'స్టూడెంట్ రివోల్ట్' గురించి ఎప్పుడయినా పేపర్లో చూసినప్పుడు కించిత్తు గాభరా పడినా, మొత్తంమీద నరసింహంగారికి ఆచిన్న వాణ్ణి గురించిన చింతేమీ లేదు.


అదేసమయంలో, నరసింహంగారి పుట్టింటివాళ్ళ దశకూడా మారింది. చదువు చదివి నాలుగు రాళ్ళు సంపాదించి, కుటుంబాన్ని లేవనెత్తుతాడనుకున్న నరసింహం, నడిసముద్రంలో సంసారాన్ని వదిలి పూలపడవలో తన మానాన్నతను పారిపోతే—

ఆయన పెద్ద చెల్లెలు చాలాకాలం పెళ్ళికాక అలా వుండివుండి ఆఖరికి వురి పోసుకు చచ్చిపోయింది. రెండో చెల్లి ఎవరో ముసిలి ప్లీడరుగారికి మూడో భార్యగా వెళ్ళిపోయింది. ఆయన అన్నయ్య టీ.బీ. తో తీసుకొని తీసుకొని ఆమధ్యనే పోయేడు. అన్నగారి భార్యా, పిల్లలు అంతా ఎక్కడుంటున్నారో, ఏమయి పోయారో ఎవరికీ తెలీదు. తండ్రి చిన్నప్పుడే పోయినా నరసింహం గారి తల్లిమటుకు చాలాకాలం పీనుగు బతుకుబతికింది. ముసిలిముద్దయిపోయి. పక్కమీద బట్టమార్చిన వాళ్ళులేక, ఆఖరపస్తలో మరీ ఘోరంగా రోజుకి నలభై సార్లు పంచందింపేస్తూవుంటే; వీధరుగు మీద పారేస్తే బతికుండగానే చీమలుపట్టిపోయి. ఈగలు ముసిరిపోయి. దెయ్యపుచూపు వచ్చేసి; మందు మాకుల్లేక, చల్లనిమాట మాటాడే మనిషిలేక, నానా యాతనాపడి ఆవిడ ఆఖరికి ఆదీన బాంధవుడి సన్నిధి చేరుకుంది.

మరి అదేసమయంలో వరప్రసాద రావు తాతగారి 'దశ' కూడా మళ్ళింది. హఠాత్తుగా తండ్రి చచ్చిపోవడంతో ఇంటరుతోనే చదువాపేసాడాయన. ఆ తరువాత చిన్నచిన్న వుద్యోగాలు చాలా చేసేడు. "పిల్లకింత తిండి పెట్టగలిగిన వాడు చాలు" ననుకొంటున్న మేన మామ కూతుర్ని పెళ్ళిచేసు కున్నాడు ఆయనకి ఇద్దరుకూతుళ్ళు, ఒక కొడుకూ.

కొడుకు ఏదో ఫేక్టరీలో పనిచేస్తూ నిద్దొచ్చిన జారి, నీళ్ళటాంకులో పడి చచ్చిపోయేడు. ఫేక్టరీ యజమానులు మురిపించి మురిపించి యిచ్చిన కాంపెన్సేషను చేజిక్కించుకొని, అతని భార్య పుట్టింటికి చేరింది. రెండోకూతురు కాపరం పరవాలేదు కాని, 'పెద్దదాని' మొగుడికి స్థిరం లేదు. అతను నెల్లాళ్ళు వుద్యోగంచేస్తే, రెండునెలలు ఇంట్లో కూర్చుంటాడు. రెండునెల్లు ఇంట్లో కూర్చుంటే నాలుగు నెలల పాటు ఎక్కడికి పోతాడో ఏంవిటో పత్తాలేకుండా పోతాడు. వాళ్ళకి అయిదు గురుపిల్లలు. పెద్దవాడు వరప్రసాదరావు.

వరప్రసాదుణ్ణి, వాళ్ళ తాతగారే




బియస్సీ దాకా చదివించారు. ఆకాడికే బ్రహ్మాండమైపోయింది. అంతకిమించి ఆయనకీ శక్తి లేదు. అందుకే—వరప్రసాదరావు వుద్యోగ ప్రయత్నం మొదలుపెట్టాడు. ఏడెనిమిది నెల్లపాటు, అతను వుద్యోగం కోసం చెడతిరిగేడు. ఇతను వుద్యోగం అడిగిన చోటల్లో, వాళ్ళు ఇతన్ని లంచం అడిగేరు; రికమెండేషన్ లెటరడిగారు. రెండూ అక్కర్లేనివాళ్ళు కులం అడిగారు. కులం సరిపోయినచోట శాఖ అడిగారు. అన్నీ అడిగారు కాని ఇతనడిగింది మట్టుకు ఇవ్వలేదు.

అలాంటప్పుడు—గోదావరి వరదలో కొట్టుకుపోతున్న వాడికి, గడ్డికుప్ప దొరికినట్టు నరసింహంగారు గుర్తుకొచ్చేరు. ఆయన్ని గురించి తాతగారు చెప్పింది వింటూ వుంటే, కల్పవృక్షమో కామధేనువో మనతాతగారి బెస్ట్ ఫ్రెండ్ అన్నట్లు ఫీలయేడు వరప్రసాదరావు. మనవడిచేతికి వుత్తరంఇచ్చి పంపించారు తాతగారు.

'ఈ బాలకుడు నా మనవడనీ; వీడి తండ్రికి స్థిరంలేదనీ; అందువల్ల తల్లీ నలుగురు పిల్లలూ మలమల మాడిపోతున్నారనీ; మీ పిల్లల ద్వారాకాని, మీకు తెలిసిన పెద్దవాళ్ళ ద్వారాకాని చిన్నదైనా సరే, ఏదో వుద్యోగం ఒకటి వీడికి ఇప్పిస్తే, చచ్చి మీ కడుపున పుడతాననీ; ఈ వుపకారం చేసి పెట్టినందుకు ఆ అనాధ రక్షకుడు మీకు ఇందుకు వెయ్యిరెట్లు మంచి చెయ్యకపోడనీ; స్వయంగా వచ్చి కష్టసుఖాలు చెప్పుకొందికి తనకాళ్ళు స్వాధీనంలోకి రావడంలేదనీ'—ఆ వుత్తరంలో వుంది.

* * *

వరప్రసాదరావు, సోఫాలో సరిగా కూర్చుందామని రెండుమూడుసార్లు అనుకొన్నాడు కాని ఎందుకో భయపడిపోయాడు. తలెత్తి చూశాడు. నరసింహంగారు వుత్తరం చదువుతున్నాడు. ఆయన

వెనకాతల గోడమీద ఫోటో చూసి గతుక్కుమన్నాడా కుర్రవాడు.

ఆ ఫోటో అందమైన ఫ్రేములో బిగించి వుంది. అది ఎవరో పెద్దమనిషి ఫోటో. ఆ పెద్దమనిషి ముఖం – గంభీరంగా పెట్టబోయి, భయంకరంగా పెట్టినట్టు వుంది. పెద్దతలపాగాతో ఆయన తల రెండింతలు పెరిగినట్టు కనిపిస్తోంది. దోసగింజంత బొట్టు, ఆయన కనుబొమల మధ్య మెరుస్తోంది. ఎక్కుపెట్టిన ఆయన మీసాలు, ఎవరివో తెచ్చి అతికించుకొన్నట్లు వికృతంగా వున్నాయి. నల్లటి చీకటి కోటులోంచి బయటకు వచ్చిన ఆయన కంఠం, తెల్లగా సున్నం వేసుకొన్నట్టు వుంది.

మొత్తంమీద, ఆఫోటోలో వున్న విశేషం ఏమిటోగాని దానివేపు మరొక్కసారు చూడ్డానికి భయపడ్డాడు వరప్రసాదరావు.

నరసింహంగారు వుత్తరం చదివి, మడిచి టీపాయ్‌మీద పెడుతూ ఒక నిట్టూర్పు విడిచాడు. పరధ్యానంగా వున్న వరప్రసాదరావు, ఫోటోలో వున్నాయనే నిట్టూర్చేడనుకొని వులిక్కిపడ్డాడు.

'అయితే, యిప్పుడు మీతాతకివొంట్లో కులాసాగానే వుందా ?... అఫ్‌కోర్స్. ఓల్ ఏజ్. నాయీడు వాడు. నాకూ యీ మధ్య వొంట్లో బావుంటటం లేద బ్బాయ్ ! మా పిల్లలు 'ఇంకా మీరు కోర్టుకి వెళ్ళడం ఏమిటి నాన్నారూ !' అంటే ఏణ్నర్థంనుంచి ప్రాక్టీసు వదిలేసేను...మీ తాత ఇంకా ఏదైనా పని చేస్తున్నాడా"?...అని ఏదో ఆలోచిస్తున్న వాడిలా ఆగిపోయేడు నరసింహంగారు.

వరప్రసాదరావు ఏం మాట్లాడలేదు. అసలు కిందాకణ్నుంచి చేతులు ఎక్కడ పెట్టుకోవడమన్నది పెద్ద సమస్య అయిపోయింది. సోఫామీద చేతులు పెట్టడానికి అసలికి భయంగావుంది. మొణుకుల మీద పెట్టుకుంటే కూర్చోడం కష్టంగా వుంది.

దానికి తోడు—

రాగానే నమస్కారం చెయ్యలేదన్న విషయం, అతనికి హఠాత్తుగా గురుకొచ్చింది. మహా పాపకార్యం ఏదోచేసినట్టు భయపడిపోయాడు. ఇప్పుడు మధ్యలో నమస్కారం చేస్తే ఏంబావుంటుంది ? మరింక వుండబట్టలేక పైకే "ప్చ" అనేసాడు.

"నేను ఎవరితో చెప్పాలంటే వాళ్ళతో చెప్తానబ్బాయ్! కాని చూడు, వెధవరోజులెలా వున్నాయంటే, మనెదురుగుండా, 'అలాగేసార్ ! తప్పకుండా' అన్న వెధవలే వెనకాతలకెళ్ళి మనమాటే మర్చిపోతారు. పూర్వపు రోజులు కావు గదా ఓ మాట అన్నారూ అంటే, దానిమీద నిలబడతారు-అని నమ్మడానికి ! నాకేమిటంటే ఓసారి చెప్పింతరవాత అది జరక్కపోతే నన్నే ఇన్సల్ట్ చేసినట్టు ఫీలవుతాను. అడిగి లేదనిపించుకోడం కంటె, వూరుకోడం వుత్తమం అనిపిస్తోందినాకు వీళ్ళని చూస్తుంటే...పోనీ మావాడితో చెప్దాంఅంటే, అవడానికి మావాడు అసిస్టెంటు ప్రొఫెసరే అనుకో కాని, వాడి నెత్తిమీద మరో వెధవ వున్నాడుకదా ! నా అనుమానం మావాడి

చేతిలో ఏమన్నావుందా అని! వాడిప్పుడు ఇంట్లో లేడు. అంతా ఆ[illegible]పోషేసరిం టికే, వాడి కొడుకూ కోడలూ వెస్జర్మనీ నించి తిరిగొస్తే చూడ్డానికి వెళ్ళేరు. తప్పదుకదా మరి! మనవాడు చెయ్యగలి గిన పనైతే నేను నిముషాలమీద చేయి స్తాను. ఈకాలపు కుర్రవాళ్ళలాకాదు. ఇప్పటికూడా. వాళ్ళంటివాళ్ళు వాళ్ళయిపోయాకకూడా, నన్ను కన్సల్ట్ చెయ్యందే ఒక్కపనీ చెయ్యరు...'' అని మళ్ళీ ఆగిపోయాడాయన.

తనేంమాట్లాడాలో తెలియక వూరుకు న్నాడు వరప్రసాద్... ఇంతకీ యీ ముసలాయన ఎవరితోనైనా చెప్తాడా, చెప్పడా? కర్ర విరుగుతుందా, పాము చస్తుందా? ఈ గోడ మీద పిల్లి ఎటు దూకుతుంది? అటా, ఇటా? .... మొహ మంతా జిడ్డు కారుతూ చిటపటలాడుతోంది వరప్రసాదరావుకి. కాని తుడుచుకొంటే 'సైలుగాడనుకుంటారో, ఏమిటో' అను కొన్నాడతను.

"ఈ రోజుల్లో వెధప కరువు అన్ని టికీ కరువే! తిండికీ కరువే, వుద్యోగా లకీ కరువే! ఐటెల్ యూ వన్ తింగ్. నేనింత చదువుకొన్నాను; అంత చదువు కొన్నాను, నాకీ వుద్యోగం సరిపోదు, అనుకొంటే మరిలాభం లేదబ్బాయ్! ఏదో ఒకటిపని, పని చెయ్యడానికి సిద్ధంగా వుండాలి. టు టెల్యూ ఫ్రాంక్లీ—నా పిల్ల లెవరికీకూడా నేను జాబ్స్‌కోసం ట్రై చెయ్యలేదు. కావాలన్నంత వరకు చదు వులు చెప్పించేను. ఆతరవాత వాళ్ళ అదృష్టం బావుంది. భగవంతుడిదయవల్ల వాళ్ళే, ఏవో మంచి వుద్యోగాలే సంపా యించు కొన్నారు... ఎవ్వళ్ళూ నాకేంవీ పంపించక్కర్లేదు. మొన్న మొన్నటి దాకా, నేనూ, మాఫాదరిన్లా ఇక్కడే ప్రాక్టీస్ చెయ్యడం చేత ఈ వూరొదిలి వుండటం నాకిష్టం వుండదు. కాని నా పెద్దకొడుకూ, పిల్లలూ 'గ్రేండ్ పాపా! మా ఇంటికి రండి రండి' అని పిలుస్తారు. కొన్నాళ్ళు బొంబే వెళ్ళి, వాళ్ళతో వుంటాను. మరింక మూడోవాడు, "ఎప్పుడూ ఆ ఇద్దరన్నయ్యల దగ్గరేనా వుంటారు? నాతోపాటు అమెరికా వచ్చే యండని" ఒకటే వుత్తరాలమీద వుత్త రాలు దంచేస్తున్నాడు... నువ్వు నా యంగెస్ట్ సన్‌ని ఎరుగుదువా?...." అని ఆగాడు నరసింహంగారు.

తమ చిన్నకుమారుని తల్చుకోడం వల్ల కాబోలు, ఆయన ముఖంలో చిన్న దరహాసరేఖ మెరిసింది.

వున్నట్లుండి గదంతా చీకటయిపో యింది. బైటవాన కురుస్తూనేవుంది. వర ప్రసాదరావు కూర్చున్న సోఫామీద, వెనకాతల కిటికీలోంచి, చిన్న తుంపర పడుతోంది.

"గొప్ప స్మార్ట్ ఫెలోలే! చిన్నప్పుడు వాళ్ళ తాతగారు— 'పెద్దయాక నువ్వేం చేస్తావురా తాతా?" అని అడిగితే, 'నేను

* అమ్మ :- ఎందుకురా! గ్రామ్‌ఫోనుమీద ఆ తెల్ల మాత్రవేశావ్?
కొడుకు:- దగ్గుమాత్రమ్మా అది. గ్రామ్‌ఫోను డిఠికే దగ్గుతోంది.

అమెరికా పోతాను తాఁటగారూ" అనే వాడు. సిల్లీ ఫెలో. చిన్నప్పట్నుంచీ వాడు అదేపాటో 'అమెరికా పోతాన్, అమెరికా పోతాన్' అంటూ వుండేవాడు. అఫ్‌కోర్స్ హీజ్ లక్కీ: భగవంతుడిదయ వల్ల వాడికి స్టేట్స్‌లో సీటొచ్చింది. స్కాలర్‌షిప్ ఇవ్వనన్నారు. 'పోండి వెధవల్లారా! దరిద్రులకీ ముష్టి వాళ్ళకీ మీస్కాలర్‌షిప్‌లు కానీ, నా కొడుక్కే ఖర్మకాలింది?' అని నేను పంపించే శాను...గొప్ప తమాషా ఏఁవిటంటే, అసలువాడు వెళ్ళేవరకు నాకూ తెలీదు. నేను కోప్పడతానని నాతో చెప్పకుండానే వాడు అప్లైచేశాడు. సీటొచ్చిన తరవాత— 'నాన్నారూ! వెళ్తాను.' అని నాదగ్గర గునిసేడు. వైఫుడై కమిన్ హిజ్‌వే? బావుపడతాన్నాన్నా అంటే వద్దనే ఫాద, రెవడైనా వుంటాడా? వెంటనే పంపించే శాను. ఆ తరవాత నాకిక్కడే అన్ని ఫెసిలిటీస్ వున్నాయి; ఇక్కడే సెటి లయి పోతాను నాన్నారూ! అన్నాడు. సరేనయ్యా, అన్నాను...' ఇదిగో చెప్తున్నా నబ్బాయ్! ఇదిమన వూరా, అది కాకపోయిందా? ఎక్కడో వోచోట హాయిగా, సుఖంగా బతికితే అంతేచాలు. ఇక్కడ కన్నా సుఖంగావుంటుందంటే, చంద్రమండలానికి పోతానన్నా నేను, వద్దన్ను... మూడేసేళ్ళకోసారి మన వేపు వస్తూనే వుంటాడు. ఎందుకు; ఏం బావుకోవాలని రావడం చెప్పు? వేలకివేలు ఎయిర్ సర్వీసెస్‌కి పొయ్యేడంతప్పిస్తే?! అయినా, ఏఁవిటో ఎక్కడికి పోయినా, 'మనవాళ్ళు'-అంటే అభిమానం పోక పోవడఁవే[illegible]టీ!" అని గుక్క తిప్పు కున్నాడు నరసింహంగారు.

అమెరికాలోవున్న ఆ తృతీయ పుత్ర రత్నాన్ని కళ్ళారా చూడలేక పోయినం దుకు నొచ్చుకొన్నాడు వరప్రసాద రావు. ఒక్కఘడియ అతను, తన ఇంటినీ, ఇంటికిరాని తండ్రినీ, మంచం వదలని తాతగారినీ; ఏడుపు ఆపని అమ్మనీ— మర్చిపోయి, నరసింహంగారే తన తాత గారైతే ఎంత బావుండునోకదా! అనుకు న్నాడు. అందులోకీ నరసింహంగారు తన కుటుంబ వ్యవహారాలన్నీ తనతో అంత ఇంటిమేట్‌గా 'చర్చించడం', అతన్ని ముగ్ధుణ్ని చేసింది. అంత పెద్దాయన, తనొచ్చినందుకు విసుక్కోడంలేదు—అదే చాలు అనిపించిందతనికి.

వరప్రసాదరావు వీపుమీద వానజల్లు వుండుండి పడుతోంది.

అంతకంతకీ వాన ఎక్కువయి పోతోంది.

చిన్న మెరుపు మెరిసింది.

"జల్లుకొట్టేస్తోందబ్బాయ్!" అన్నాడు నరసింహంగారు. అని, ఒక్క క్షణం వరప్రసాదుడి వైపు చూసేడు.

'అవున్నిజఁవే! జల్లు కొట్టేస్తోంది' —అన్నట్టు బుర్ర వూపేడు ప్రసాద రావు. చిన్నవిసుగులాంటి మూలుగుతో, సోఫాలోంచి లేచేడు నరసింహంగారు.

చుట్టూ తిరిగి వెళ్ళి, ప్రసాదరావు వెనకాతలవున్న కిటికీ అద్దాల తలుపులు మూసేసాడు.

పూని పుచ్చుకొని ఒక్క లెంపకాయ

కొట్టినట్టనిపించింది వరప్రసాదరావుకి. అతని గుండెలు అతివేగంగా కొట్టు కొన్నాయి. తలతీసి ఎక్కడయినా పెట్టే ద్దామనిపించిందతనికి.

అద్దాలతలుపుల్లోంచి బయటకుచూస్తూ "ఈ వర్షం ఇప్పుడప్పుడే వదిలేలాగ లేద బ్బాయ్!' అన్నారు నరసింహంగారు.

ఎక్కడో దూరంగా పిడుగు పడింది.

'నువ్విప్పుడప్పుడే నన్నువదిలే లాగ లేవబ్బాయ్!' అన్నట్టే వినిపించింది వరప్రసాదరావుకి. వున్నట్లుండి అతనికి వెన్నుపూసలోంచి, వణుకు ఆరంభ మైంది.

బయట—

హోరున వాన కురుస్తోంది. ఉండుండి ఆకాశం పెద్దవెలుగుతో చీల్చు కొంటోంది. దూరంగా గేటవతల వీధిలో దీపస్తంభానికి కట్టిన గేదె ఒకటి తడిసిపో తోంది దానిముందు వేసిన గడ్డిపరకలు నీళ్ళలో కొట్టుకుపోతూ వుంటే. వెర్రి ముండలా చూస్తూ వుండి పోయిందా గేదె. ఎక్కణ్ణించో కుక్కపిల్ల ఒకటి తడిసిపోయి, చలికి కాబోలు, 'కుయ్యి. కుయ్యి.' మని అరుస్తోంది.

గదిలో ట్యూబ్ లైటు వేసి, మళ్ళీ వచ్చి సోఫాలో కూర్చున్నాడు నరసిం హంగారు.

'టింగ్ టింగ్' మని చప్పుడుచేస్తూ, గుప్పున వెలిగింది ట్యూబ్‌లైటు. మూలని నక్కివున్న ఎలకని టార్చిలైటు వేసిమరీ పిల్లి పట్టుకొన్నట్టనిపించింది, వరప్రసాదరావుకి.

చిరుచలితోవున్న అతన్ని చూస్తే తువ్వాలిచ్చి, 'తల తుడుచుకో' మని చెప్దామన్న ఆలోచన నరసింహంగారికి మెరుపులా మెరిసిందికాని, అంతలోనే ఆ ఆలోచన చప్పగా చల్లారిపోయి, అంత రాంతరాల్లో ఎక్కడో ఇరుక్కు పోయింది.


"మా ఫాదరిన్నాని నువ్వెరుగుదువా?"

నరసింహంగారి వేపు చూసాడు ప్రసాదరావు, బితుకు బితుకుమంటూ. ఆయన ఒక్క పిసరు వెనక్కి తిరిగి తన వెనకాతల వున్న ఫోటోని చూసేడు. ఆ ఫోటోని చూస్తూనే నరసింహంగారి ముఖం ఒక విధమైన తేజస్సుతో వెలిగి పోయింది.

వరప్రసాదరావు మళ్ళీ ఆ ఫోటో చూసేడు. అతనింతకుముందు గమనించ లేదుగాని, ఆ బొమ్మలోని పెద్దమనిషి చిన్ననవ్వు నవ్వడానికి ప్రయత్నిస్తు న్నాడు. ఆనవ్వు, శవం నవ్వినట్టుంది. పరమభయంకరంగా వుంది. కళ్ళు దించేసుకొన్నాడు ప్రసాదరావు.

నరసింహంగారు గొంతు సవరించు కొన్నారు.

"నువ్వెరుగవులే! మీ తాతగారికి బాగా తెలుసును. కాని, అబ్బాయ్! చెప్తు న్నాను, అలాంటి మనిషి నూటికో కోటికో ఒక్కరుంటారు. ఆయన ఎన్నిపుస్తకాలు చదివేరు? ఎంత జ్ఞానం సంపాదించేరు? ఆయన్ని చూస్తూవుంటే —మనం ఎప్పటి కైనా ఈయన సంపాదించిన జ్ఞానంలో నూరోవంతు సంపాదించగలమా?—అని నాకనిపించేది కాని, చెప్తున్నాను విను.




నెవర్. నెవరిన్ మైలైఫ్. నేనుమాత్రం ఇప్పటిదాకా సాధించలేక పోయాను... అంత పండితుడాయన. అలాంటి దైవ భక్తుణ్ణి మళ్ళీ మరోణ్ణి చూళ్ళేదు నేను. ఈ రోజుల్లో చదువుకొన్న ప్రతి గాడిదా 'దేవుడులేడు, దెయ్యంలేదు' అంటూ బయల్దేరుతున్నారుగాని, వీళ్ళందరూ లేడనేస్తే లేకుండా పోతాడా ఏఁవిఁటి? వాడ్డూయూసీ? నువ్వునమ్ముతావా, నమ్మవా...." అని ఆగేడు నరసింహంగారు.

వరప్రసాదరావు, ఏదో చెబ్దామని నోరు విప్పేడుకాని, అతను చెబ్దామనుకొన్న ముక్కలు గొంతుకడ్డం వచ్చి గుటకతో మింగుడు పడిపోయేయి.

నరసింహంగారు ఏఁవనుకొన్నారో, ఏమో మళ్ళీ మొదలెట్టాడు.

"మాటవరసకి నా ఎల్డెస్ట్‌సన్, నా డాటరిన్లా, వాళ్ళ పిల్లలూ అంతా చదువుకొన్న వాళ్ళే! బట్ దే ఆర్ ఆల్ గాడ్ ఫియరింగ్ పీపుల్. ప్రతి ఏడూ పిల్లలకి పరీక్షలయిపోగానే మన వేపు వస్తారు. మా పెద్దవాడూ, మగపిల్లలూ అంతా తిరపతిలో తలనీలాలు సమర్పించుకు మరీ వెళ్ళారు. అందులోనూ, నా ఎల్డెస్ట్ గ్రాండ్‌సన్-అచ్చు మాఫాదరిన్లా పోలికే వాడిది- వాడు బొంబే ఐ.ఐ టీ.లో కెమికల్ టెక్నాలజీ చదువుతున్నాడు. వాడు మరి ఏపనిచేసినా ఆ ఏడుకొండల వాణ్ని తల్చుకోందే చెయ్యడు .... చెప్పొచ్చేదేఁవిఁటంటే, మా మాఁవ గారికి అంత దైవభక్తి..."

వరప్రసాదరావు, నోరు కొంచెం వేళ్ళాడేసుకొని వింటున్నాడు. వింటున్నకొద్దీ అతనికి వెన్నుపూసలో వణుకు ఎక్కువవుతోంది.

"ఆయన కోర్టుకెళ్తే అర్ధణాకేసులూ

ఆణాకేసులూ ఎప్పుడూ చేసేవారుకాదు. నేను కొత్తగా ప్రాక్టీసుపెట్టిన రోజుల్లోనే నాతో చెప్పేరు,— 'నాయనా, నరసింహం! మనకున్న ఆస్తి ఇప్పటికైనా, ఎప్పటికైనా చదువు ఒక్కటేకదా! అంచేత మనం మన చదువు సంధ్యల్ని అలగా వెధవలకీ, అడుక్కుతినే వెధవలకీ దానం చేస్తే, ఆఖరికది మనకే బెడిసికొట్టి మనల్నికూడా వాళ్ళలో లత్తుల్యుల్ని చేసేస్తుంది. అందుకే అపాత్రదానం కూడదన్నారు. మరింక బతకలేం— అంటావూ, ఈ వెధవ మురికి కేసులూ, ముష్టికేసులూ చూసుకుంటూ బతకడం కన్న ఆ పరమేశ్వరుడి సాన్నిధ్యానికి పోవడం నయంకాదూ!' అన్నారు. అంతే! అన్నమాట నిలబెట్టుకొన్నారు. ఆవేళే నేనూ వెంకటేశ్వరుడి సాక్షిగా ఒట్టువేసుకొన్నాను... అది ఖూనీకేసు కానీ, ప్రోనోటు కేసుకానీ. పార్టీవచ్చి— బాబూ! రక్షించు అని అడిగితే, 'అట్బే! ఇంతవుతుంది' అని చెప్పి డబ్బుకి డబ్బూ కరాఖండీగా పుచ్చుకునేవారు; పనికిపనీ కరాఖండీగా చేసేవారు "

ఎక్కువ మాట్లాడుతున్నానేమోనని సందేహం వచ్చి ఒకక్షణం ఆగేరు నరసింహంగారు. కాని చెప్తున్నది— హై క్లాస్ డిగ్నిఫైడ్‌లైఫ్ గురించే కాని లోక్లాస్ రెచెడ్ లైఫ్ గురించి కాదు కదా!

చిన్న నవ్వు నవ్వి "ఇప్పుడు తల్చుకుంటే నాకే నవ్వొస్తోంది. ఓసారి నా చిన్నతనంలో అమాయకంగా నేనాయన్ని అడిగేను, 'అయితే, మావగారూ! ఖూనీ చేసిన వాణ్ణి రక్షిస్తే, అది దుష్టరక్షణ అవుతుంది కదా! అది పాపం కాదా?'— అని ఆ ప్రశ్నకి అబ్బాయ్ చెప్తున్నాను. మరెవరైనా అయితే పూరంత కోపం తెచ్చేసుకొనేవారు. కాని ఆయన మాత్రం అంతా విని చిన్న నవ్వు నవ్వి,— 'అది కానే కాదోయ్! మనం చేస్తున్నదేవీలేదు. ఆ చచ్చిపోయిన వాడు వీడి చేతిలో చావ్వాలిసుండి; వీడికి వాణ్ణి చంపాలిసుండి; వీడు బతకవలసుండి మన దగ్గిరకు రావలిసున్నపుడు—మధ్యలో మన మెవళ్ళమోయ్, 'దుష్టరక్షణ అవునా కాదా?' అని ఆలోచించడానికి ఆజగత్పాలకుడి చర్యల్ని ప్రశ్నించడానికి నువ్వుగాని, నేనుగాని ఎవళ్ళమైనా ఎవళ్ళమోయ్? ఎవడి కర్మపరిపాకం ఎలావుంటే అలా జరుగుతుంది' అని ఆయన సుళువుగా చెప్పేరు" అన్నారు నరసింహంగారు.

అలా 'గోడకుర్చీ' వెయ్యడంవల్ల, వరప్రసాదరావు కాళ్ళు తిమ్మిరెక్కి, వణుకుతున్నాయి. మెడ నొప్పెడుతోంది. తలెత్తి చూసేడు. ఎదురుగా ఫొటోలో వున్నాయన— "బతుకులో ఇంకా అంతుచూడాలిసినవి ఎన్నో వుండగా, అప్పుడే ఇలాగ చచ్చి శవాన్నయిపోయానే" అన్న అసూయతో బతికున్న వాళ్ళని శపిస్తున్నట్టు చూస్తున్నాడు. వెంటనే కళ్ళు తిప్పేసుకొన్నాడు వరప్రసాదరావు.

"ఇంతకీ నేను చెప్పిందేవిటంటే, ఆయన 'లా' పుస్తకాలు ఎంత క్షుణ్ణంగా చదివేరో, ధర్మశాస్త్రాలూ, శ్రుతులూ,

స్మృతులూఅంత క్షుణ్ణంగానూ చదివేరు. ఎప్పుడూ చదువు, చదువు, చదువు, చేస్తే కోర్టుపనిచెయ్యడం, లేకపోతే ఒక పుస్తకంచదువుతూ వుండటం. ఆఖరిరోజుదాకా ఆయన కోర్టుకి వెళ్తూనే వున్నారు. ఆ ఫొటో పోయిన వెంటనే తీసిందే...ఓ సారిలాగే ... " నరసింహంగారు టక్కుమని ఆగిపోయేడు.

బైట వరండాలో ఏవోమాటలు వినిపించేయి. అంతలోనే ఎవరో తలుపు దబదబ కొట్టేరు.

నరసింహంగారికి చాలా చిరాకేసింది. "కాల్ బెల్ వుంటే,తలుపుబాదుతారు....'' అంటూ లేచివెళ్ళాడాయన.

సోఫాలోసరిగా కూర్చుందామనుకొన్నాడు వరప్రసాదరావు, కాని, వెంటనే–'ఇంత సేపూ ఒకలా కూర్చుని, ఇప్పుడొక్కసారి 'దర్జాగా' కూర్చుంటే బావుంటుందా ? అని ధర్మసందేహంలో పడ్డాడు.

వరండాలో లైటువేసి, తలుపుతీసాడు నరసింహంగారు.

తలుపు తీసిన నరసింహంగారికి, అవతల వరండాలో—వానలో తప్పతడిసిపోయిన ఒక ముసలివాడూ, ఒక పడుచుపిల్లా కనిపించేరు. వొంటికి గుడ్డలు అంటుకుపోయి—ముసలివాడి ఎముకలూ, పడుచుపిల్ల వొంపులూ నరసింహంగారికి స్పష్టంగా కనిపించేయి.

నరసింహంగారి మొహంలో మారుతున్న రంగుల్ని ఆమనిషి గమనించలేదు. "వారసంలో తడిచి. పోనాం. మా తాతకి జొరంగుంది. కుసెంత సేపు లోపల కూసుంటాం బాబూ ?" అంది.

కళ్ళు మిరిమిట్లుగొలిపేలా ఓ మెరుపు మెరిసింది.

నరసింహంగారికి మొదట అర్థంకాలేదు. "ఎవర్నువ్వు ? ఏంవిటికావాలి ?" అని ఆయన గర్జించినట్టు అడగేడు.

"మాతాతకి జొరం. వారసం తగ్గేదాకా లోపల కూసుంటాం బాబూ ! దాదా, ముసిలీ !'' అందా మనిషి మళ్ళీ.

నరసింహంగారికి అంతా అర్థం అయింది.

ఎక్కడో పిడుగు పడింది.

"నించో, ఎవడొద్దన్నాడు ? నించోండి !'' అన్నాడాయన కొంతతగ్గి.

"వారండాలో జల్లుకొట్టేస్తున్నది బాబయ్యా! మా తాత తడిచిపోతన్నాడు. జొరంగుంది బాబూ, వొక్క సిటం కూసుండి పోతాంతండ్రీ !"

"బావుంది ! ఏదో సాంవెంత చెప్పినట్లుంది. గదిలో దూరిపోతానంటుందేంవిటీ పిల్లా? వరండాలో నించోమంటే నీక్కాదూ?" అంటూ తలుపు వేసేసాడు నరసింహంగారు.

"బాబూ ! బాబ్బాబ్బాబు!" అంటూనే వుందా మనిషి.

"పోనీ, ఇక్కడే నించుందాం, పోన్లేయే !" అంటూ ముసలతనివి కాబోలు. నూతిలోంచి వచ్చినట్టు మాటలు విన్పించాయి.

నరసింహంగారు రొప్పుతూ వచ్చి. సోఫాలో కూచ్చున్నాడు.

"చూడు ! ఆముండ ధార్టీ ! లోపలికి వచ్చేస్తుందిట లోపలికి ! ఇదేం ధర్మసత్రవనుకొాందో, దీని బాబుగారు కట్టించిన ఇల్లనుకొంటోందో ? ఆముసిలి వెధవ చూడు, ఇప్పుడా మరో క్షణం లోనా అన్నట్టున్నాడు... వరండాలో నించోనిస్తే, గదిలోకి వస్తానంటోంది. ఆతరవాత, దానిసొమ్మేం పోయింది, ఆ జబ్బువెధవకి మంచం వియ్యమంటుంది. 'నాయనా, బాబూ' అని బతిమాలితే లొంగిపోయి లోపలికి రానిస్తానను కొంటోంది కాబోలు, దొంగముండ. పోనీ కదా అని రానిస్తాంవనుకో. తీరా, ఆ ముసిలాడు ఇక్కడే గుటుక్కుమంటే వెధవకి ఏంరోగవో. వూష్ణంఅంటోంది. ఏమో, ఏవిషజ్వరవో, ఎవరికి తెలుసు ? అయ్యోపాపం ? అనుకొంటే, ఆ వెధవ రోగాలన్నీ మనింట్లో ప్రవేశించి, మనల్ని పీక్కుతినేస్తాయే !... ఆవెధవల కయితే ఫరవాలేదు. రండికీ మొండికీ వోర్చేసి వుంటారు...వర్షంవొస్తే?... వరండాలో నించోమన్నాను కదా ? మరోడయితే, గేటుదాటి లోపలి కెందుకొచ్చేవని తగిలేసును !...ముసిలాడు బాగా తడిసిపోయి నట్టున్నాడు, వూరికే వణికిపోతున్నాడు, జబ్బులొచ్చేయంటేరాపు మరి?! ఓచదువా సంధ్యా, వల్లకాడా, వసిన దిబ్బా ? మళ్ళీ వెధవలింటిల్లీపాదీ సంపాయిస్తారు. ఓ కాణీ మిగల్చడం ఏంవన్నా వుంటుందా ? అదేంవీం లేదు.... తాగేసి తందనాలాడటం.... పోనీ వుంటున్న చోట ఏంవన్నా శుభ్రం అదీ వుంటుందా ? జబ్బులొచ్చేయంటే వాటిదా తప్పు?...." గుక్కతిప్పుకొన్నాడు నరసింహంగారు.


వరప్రసాదరావుకి, నరసింహంగారి వేపు చూడానికే భయం వేసోంది. సరిగ్గా వెనకాతల ఆయన తలమీద వున్న మాంవగారి బొమ్మ, ఆయన్ని ఆవహించిన దెయ్యంలా కన్పించిందతనికి. తిమ్మిరెక్కిన కాళ్ళు, స్వాధీనంలోకి రావడంలేదు. లేస్తే, తూలిపడిపోతానేమో ననిపించిందతనికి.

"చెప్పలేమబ్బాయ్! కీడెంచి మేలెంచమన్నారు. ఆ ముసిలాడికి నిజంగా జ్వరం లేదేమో ! ఇద్దరూ దొంగ వెధవలేమో ఎవడు చెప్పగలడు, అందులోనూ, ఈ రోజుల్లో దొంగతనానికి సవాలక్ష మార్గాలు. కాయకష్టం చేసి బతకడం మానేసి దోచేసుకు బతికేదాం అనుకొనే వెధవలికి మరి ఈ పోలీసులూ, ఈ కోర్టులూ లాభం లేదబ్బాయ్ ! నన్నడిగితే, దొంగ వెధవలు దొరికితే, నలుగురూ కలిసి చితకతన్నెయ్యాలి. అట్టే మాట్లాడితే, అక్కడే కాల్చిపారెయ్యాలి. దెబ్బతో మరెవడూ దొంగతనాలకి దిగడు."

నరసింహంగారిముఖం, ఎర్రగా దుంపలా అయిపోయింది. ఆవేశంతో వూగిపోతున్నాడాయన.

బైట వానకి గాలితోడయింది. వూరూ వాడా ఏకవయిపోయేంత వాన కురుస్తోంది. వరండాలో మాటలు వినిపించడంలేదు.

వరండాలో వదిలేసినజోళ్ళు, ఓసారి గుర్తుకొచ్చేయి కాని ఆ భయంలో, ఆ చిరుగాలిలో ఆమాటే మర్చిపోయేడు వరప్రసాదరావు.




ఇంతలో—

మళ్ళీ తలుపు దబదబ బాదేరెవరో. ఈసారి ఆగకుండా బాదుతున్నారు.

వరప్రసాదరావులేచి వెళ్దామనుకున్నంతలో, చివాల్న నరసింహంగారే వెళ్ళేడు. ఆయనకి అరికాలిమంట నెత్తికెక్కింది.

వరప్రసాదరావు గుండె ఒక్కసారి కొట్టుకోడం మానేసి, మళ్ళీ గబగబా కొట్టుకొంది. ప్రళయవేళ రుద్రుడిలా వున్నాడు నరసింహంగారు.

నరసింహంగారు, కోపం వంతా తలుపుమీద చూపించి, తలుపు తీసేడు.

ఆయన ఇలా తలుపు తియ్యడం ఏవిటి, 'సర్ర్' మని గాలీవానాతో పాటు ఆ పడుచుపిల్ల ముసలాని చెయ్యి పట్టుకొని లోపలకు రావడం ఏవిటి— మెరుపు మెరిసినంతలో జరిగిపోయేయి. నరసింహంగారు కొంచెమాగి, వెనక్కి జరిగేడు.

"ఏయ్! వ్హాటీజ్ దిస్? ఏవిటీ దౌర్జన్యం? చెప్తూవుంటే నీక్కాదూ! నువ్వు మనిషివా పశువ్వా? గెటౌట్! పొండి ముందు! వూఁ! బయటికి పొండి'' అని అరిచేరు నరసింహంగారు.

ఆమనిషి నోట మెదపలేదు. వరప్రసాదరావు వేపు ఓ చూపు చూసిందావిడ. కాని ఆ కుర్రవాడు తన భయంలో తనుండి, ఆ చూపుల్ని గమనించలేదు.

ఆ మనిషి మౌనం, నరసింహంగారిని మరింత రెచ్చగొట్టింది.

"పోతారా, పోరా? పోలీసుల్ని పిలిపిస్తాను. ఏమనుకొంటున్నారో? మర్యాదగా పొండి! క్విక్! గెటౌట్!''

ఆవిడ అప్పటికీ ఏంమాటాడలేదు. హోరున వాన చప్పుడు, చెవుల్లో గింగురు మంటోంది. దబాయించి కురుస్తోంది వాన. తీసిన తలుపులోంచి, వరండాలో జల్లు, గదిలోకి కూడా వాస్తోంది. చల్లటిగాలి వుండుండి వీస్తోంది.

తోఁకమీద లేచిన వా...లా నిల్చున్నాడు నరసింహంగారు. ఆ మనిషి, ముసిలతనిచేతిలో కర్రతీసుకొని, అతన్ని గోడకి చేఁవగా కూర్చోబెట్టింది. చేతిలో సంచినీ, కర్రనీ ఆపక్కనే వుంచింది. జుత్తుముడి విప్పుకొని దులుపుకొంది.

నరసింహంగారు ఈ అవమానాన్ని సహించ లేక పోయేడు. "రాస్కెల్స్! మీరిలాగ పోరు! పోలీసులకి ఫోను చేస్తాను. "అంటూ ఫోను దగ్గరకు వడిచేడాయన

జుత్తు ముడివేసుకొని, కొంగు బిగించి కొంచెం ముందు కొచ్చిందా అమ్మాయి.

ఈ క్షణంలో ఏ సిద్ధుడోవచ్చి, తనని మాయంచేస్తే బావుండు ననుకొన్నాడు వరప్రసాదరావు.

"ఏటి బాబు! పోలీసోల్ని పిలిపిస్తాన్ పోలీసోల్ని పిలిపిస్తాన్– అని జడిపిస్తున్నావ్. పిలు బాబు! పిలు. అంతకంటె నువ్వు మాత్తరం వేటి సెయ్యగలవు? ఆలు నీసేతిలున్నారు గనక ఆల్ని పిలుస్తావ్. పోలీసోల్లని కాకపోతే మిలిట్రోల్నిపిలు! ఏటి నానేటి నీవొంటిమీద సెయ్యేసినానా? నీ ఇల్లడిగినానా, నీ కోకలడిగినానా, నీ డబ్బడిగినానా? ముసిలిముండాకొడుకు నిస్సారనంగ సచ్చిపోతాడు; వారసం వొగ్గగానే పోతాం బాబూ!—అన్నాను. అంతేనా, అంతకంటేపైనా అదికంగ అడిగినానా? సెప్పు' అందామనిషి 'మర్యాద' గానే.

"ఈ వెధవకబుర్లు చాలుగాని. ఫో బయటికి. ఐవిల్ నెక్ యూ అవుట్. మిమ్మల్ని మెడపట్టుకు గెంటేస్తాను. పొండిముందు!" అరిచేడు నరసింహంగారు. ఫోను ఎత్తుతూ.

"ఏటి బాబూ! మరియాదగ నాయ్నా బాబూ అంటే బిర్రబిగిసి పోతున్నావు. నానెల్లను బాబూ! మావెల్లం. ఇక్కణ్ణుంచి ఒక్కడుగు కదలం. ఏటిసేస్తావో సెయ్యి వోరసం వొగ్గాల; మాఁవు కదలాల. నీసిత్తం కొచ్చింది సెయ్యి పోలీసోల్లనే పిలిపించు కుంటావో, మిలట్రోల్లనే పిలిపించుకొంటావో నియ్యిష్టం.... కూసోరా ముసిలీ!" అంటూ లేచిపోతున్నా ఆముసిలతన్ని కూర్చోబెట్టి, అక్కడేవున్న కిటికీలోకూచ్చుంది ఆ పడుచుపిల్ల.

నరసింహంగారు ఫోను దించేసేరు. పడుచుపిల్ల వయసుచూసే దించేసేరో, ముసిలవని జబ్బుచూసే దించేసేరో, ఇది అపాత్రదానం కావని తమని తాము నమ్మించుకొనే దించేసేరో, పోలీసుల్ని ఇంట్లోకి రానివ్వడం కోరి శనిని ఇంట్లో తెచ్చుకోవడమే అనుకొని దించేసేరో— ఎందుకోగాని మొత్తంమీద ఫోను దించేసారు నరసింహంగారు

"వెధవలకిచెప్తే అర్థంకాదు" అంటూ గొణుక్కొన్నారు.

నరసింహంగారు కచ్చ సర్దుకొంటున్నారు. గోడమీదఫోటో బోనులో బంధింపబడ్డ పులిలాగ, సీసాలో దిగబడిన పిశాచంలాగ, గిలగిలలాడుతోంది.

వరప్రసాదరావు, ఠీవిగా సోఫాలో వెనక్కి జారబడి, బేక్‌పాకెట్‌లోంచి దువ్వెనతీసి, జుత్తుమీదికిదువ్వుకొన్నాడు. రుమాలుతో ముఖం తుడుచుకొన్నాడు.

వరండాలో వానజల్లు పడుతూ తివాసిని తడిపేస్తోంది.

*